క్లుప్తంగా

ఘనంగా ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య నగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన గురువారం వసంతనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అమ్మవారికి విశేషంగా చీరలతో అర్చనలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం కేబీఎన్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్‌ను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలను ఉత్తీర్ణులైన విద్యార్థులు ముున్ముందు ఏ కోర్సులు తీసుకుంటే మంచిది, ఏ కోర్సుల ద్వారా ఏ విధమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి, డిగ్రీ కోర్సులకు ఏలా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చనే అంశాలను అధ్యాపకులు కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు వివరిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. అలాగే తగిన సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9182907747, 9494759593లో సంప్రదించాలని కోరారు.

అపురూపం.. శ్రీరామ పట్టాభిషేకం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలు, శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన యల్లాజ్యోసుల అనురాధ బృందం ప్రదర్శించిన శ్రీరామ పట్టాభిషేక నృత్యరూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్యరూపకంలో అయోధ్యలో పుత్రకామేష్టి యాగం, రామ లక్ష్మణ, భరత, శత్రుఘ్నల జననం, యాగ రక్షణ, సీతా స్వయంవరం, అరణ్యవాసం, రామ రావణయుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం వంటి అంశాలను చక్కటి నృత్య రూపకంలో ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు ఆలయ ఈవో రామరావు సత్కరించి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

అలరించిన మ్యాజిక్ షో



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం టీవీ మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ చేసిన మిమిక్రీ భక్తులను అలరించింది. శ్రీనివాస్ చేసిన మ్యాజిక్, ఇంద్రజాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు, కళాభిమానులు మిమిక్రీ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మిమిక్రీ శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యాన సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీర్రాజు, గంగిశెట్టి సాంబశివ రావు పర్యవేక్షించారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్ట్



తిరువూరు: అక్రమ మద్యం, సారా రవాణాను నియంత్రించేందుకు గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తిరువూరు సర్కిల్లో దాడులు నిర్వహించారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో సారా విక్రయిస్తున్న చప్పిడి కృష్ణకుమారి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నెమలిలో అధికారులు జరిపిన దాడుల్లో 15 తెలంగాణ మద్యం సీసాలతో యాదాల జయరాజ్ పట్టుబడ్డాడు. ఎ. కొండూరు మండలం గొల్లమందల తండాలో దారావత్ బద్దు నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తిరువూరు కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

పక్కా లోకల్‌కి పట్టం కట్టండి





సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- నేటి నామినేషన్ ర్యాలీకి తరలి రండి
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పిలుపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బ్యాంక్‌లనే మోసగించిన ఆర్థిక నేరస్తుడు రేపు ప్రజలను మోసం చేయడని గ్యారంటీ ఏమైనా ఉందా? ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ కోరారు. శుక్రవారం ఆయన నామినేషన్ వేయనున్న నేపథ్యంలో స్థానిక బైపాస్ రోడ్ పక్కన ఉన్న పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సామాన్య కార్యకర్త యిన తనను ఈ స్థాయి వరకు తీసుకువచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటానని చెప్పారు. మరో నెల రోజుల పాటు కష్టపడి తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే వచ్చే ఐదేళ్లపాటు అందరికీ అందుబాటులో ఉంటూ సీఎం జగనన్న స్ఫూర్తితో సేవ చేసుకునే అదృష్టాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం ఎల్లలు తెలియని సుజనా చౌదరిని ఇక్కడ పోటీ చేయిస్తున్న చంద్రబాబు కూటమికి బుద్ధి చెప్పాలని, పక్కా లోకల్ అయిన తనను గెలిపించాలని కోరారు.

విజయోత్సవ ర్యాలీ కావాలి..

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నామినేషన్ కోసం ఏర్పాటు చేసిన ర్యాలీ ఆసిఫ్ విజయోత్సవ ర్యాలీ కావాలని ఆకాంక్షించారు. గత రెండు ఎన్నికల్లో ఇక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయం సాధించారని, రానున్న ఎన్నికల్లో ఆసిఫ్ గెలుపుతో పశ్చిమ నియోజకవర్గం హ్యాట్రిక్ కొట్టబోతుందన్నారు. నాటికి నేటికీ ఎప్పటికీ పశ్చిమ గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా అని స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు గుబ్బా చంద్రశేఖర్, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీ ఇలా..

శుక్రవారం ఉదయం 8 గంటలకు వన్‌టౌన్ పంజా సెంటర్ నుంచి భారీ ర్యాలీతో బయలుదేరి గణపతిరావు రోడ్, నెహ్రూ బొమ్మ సెంటర్, కేటీ రోడ్, చిట్టినగర్, సొరంగం, సితార జంక్షన్, చెరువు సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్ మీదుగా పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ (తహసీల్దార్ ఆఫీస్) అధికారి కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుందని ఆసిఫ్ వివరించారు. ఇందులో పార్టీ ముఖ్యనాయకులు పాల్గొంటారని, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసును పక్కదారి పట్టించేయత్నం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించాల్సింది పోయి టీడీపీ నాయకుడు వర్ల రామయ్య కేసును పక్కదారి పట్టించే విధంగా మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెజ్జోనిపేట 35వ డివిజన్ వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి రాష్ట్రంలో ఇక టీడీపీ కూటమి అధికారంలోకి రాదనే సంగతి తెలుసుకున్న టీడీపీ నాయకులు ముఖ్యమంత్రిపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడిని ప్రోత్సహించింది టీడీపీ నాయకులే అని పోలీసుల విచారణలో బయటకొస్తున్న నేపథ్యంలో వర్ల రామయ్య కేసును తప్పుదారికి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసు వృత్తిని నిర్వర్తించిన ఆయనకు పోలీసుల దర్యాప్తులో జోక్యం చేసుకోకూడదన్నా ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోయిందన్నారు. పార్టీ నాయకులు సంగీత్‌బాబు, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విజయవాడ రోడ్డులోని మారుతీ గ్యాస్ ఏజెన్సీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీలో కానీ, ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శనల ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత బాపులపాడులోని జెడ్పీ హైస్కూల్‌లోనూ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు.

వైభవం.. శ్రీరామ పాదుకా పట్టాభిషేక మహోత్సవం



పాదుకా పట్టాభిషేకంలో స్వామి వారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి పాదుకా పట్టాభిషేక మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై గురువారం ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తుల శ్రీరామనామస్మరణల నడుమ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను జరిపించారు.

ఘనంగా వాహనోత్సవం

శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి వాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవంలో భాగంగా స్వామివారి చిన్నరథంపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి ఈ వాహనోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి బయలుదేరిన ఉత్సవం పరిసర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి.. తిరిగి ఆలయానికి చేరుకుంది.

సమాజంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రావూరి వెంకట సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటితరం విద్యార్థుల్లో సమాజంపై అవగాహన పెరగాలని రోటరీ క్లబ్–3020 గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు సూచించారు. గాంధీనగర్‌లోని చిట్టూరి పబ్లిక్ స్కూల్ సమావేశ మందిరంలో ఆయన గురువారం విద్యార్థులతో సమావేశమై ప్రసంగించారు. రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమైన పోలియో నిర్మూలన అంశంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాయన బాబ్జి మాట్లాడుతూ.. క్లబ్ నిరంతర కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల కోసం దంత, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సెక్రటరీ ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో పేదలకు సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చిట్టూరి ఆనంద రామ సుధాకర్, అమానుల్లా, పోతిన సురేష్, సుబ్బరాజు, జి.వి.రావు, జె.కె. సుబ్బారావు, ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం



వన్‌టౌన్‌లో నేత్రపర్వంగా సాగుతున్న రథోత్సవం



పూజలు నిర్వహిస్తున్న డీసీపీ హరికృష్ణ



కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతుడైన కల్యాణరాముని రథోత్సవం గురువారం సాయంత్రం కనులపండువగా జరిగింది. కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీనగరాల సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, విచిత్ర వేషధారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామి వారి రథోత్సవం ఘనంగా ముందుకు సాగింది. తొలుత డీసీపీ హరికృష్ణ కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. కమిటీ ప్రముఖులు అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథానికి వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో నయనానందరంగా అలంకరణ చేశారు. అనంతరం సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో రథంపై అధిష్టింపజేశారు. రథోత్సవానికి తొలుత పలు ప్రత్యేక వైధిక కార్యక్రమాలను నిర్వహించారు. వారు పోసి, కుంభం సమర్పించి రథాన్ని ముందుకు లాగారు. బ్రాహ్మణవీధి ఆలయం నుంచి ప్రారంభమై నెహ్రూ బొమ్మ సెంటర్, కేటీరోడ్డు, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రథోత్సవం సందర్భంగా స్థానిక ప్రజానీకం దారిపొడవునా హారతులిస్తూ స్వాగతం పలికారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌శాఖ, పోలీస్ శాఖలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఈ రథోత్సవంలో పాల్గొన్నారు.

కాలనీల్లో అభివృద్ధి పరుగులు

- 24వ డివిజన్‌లో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.8 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం
- రూ.7 కోట్లతో మోడల్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న డివిజన్ ప్రజలు



అధునాతనంగా రూపుదిద్దుకున్న కడియాలవారి వీధి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, స్థానిక నాయకత్వం చొరవతో 24వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు పెట్టింది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని తమ ప్రాంతాలు ఎంతో పురోగతి సాధించాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో మురుగు కూపాలుగా ఉన్న రోడ్లు సీసీ, బీటీ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ ఆధునికత సంతరించుకుంది. ఒకప్పుడు ఎక్కడ చూసిన మ్యాన్‌హోల్స్ పొంగుతూ కనిపించే రోడ్లు, ఇప్పుడు మెరుస్తున్నాయి. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో కళ్లకు కనిపిస్తోంది.

అందుబాటులో మోడల్ సబ్‌స్టేషన్..

గిరిపురం, న్యూ గిరిపురంలో పేదలు నివసిస్తారు. విద్యుత్ సరఫరాలో తరుచూ హెచ్చుతగ్గులు వస్తుండటంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినేవి. ఈ సమస్యను ప్రభుత్వం ఆ ప్రాంతంలో పాటు, చుట్టుపక్కల కాలనీల్లో మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో వాటర్ ట్యాంక్ రోడ్డు వైపు రూ.7 కోట్లతో అత్యాధునిక సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అత్యాధునిక కంట్రోలింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయగా, ట్రాన్స్‌ఫారంను సిద్ధంచేశారు. త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రజలు అందుబాటులోకి రానుంది.

మౌలిక సదుపాయాల కల్పన


సీతారామపురం కడియాల వారి వీధిలో సన్‌రైజ్ హాస్పిటల్ పక్కన గతంలో మ్యాన్‌హోల్స్ నుంచి ఎప్పుడూ మురుగు పొంగుతూ ఉండేది. మురుగు నీరు రోడ్డుపై నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పేవి కాదు. ప్రస్తుతం ఆ రోడ్డులో కొత్తగా యూజీడీ పైప్‌లైన్ వేయడంతో పాటు, రోడ్డును నిర్మించారు. గద్దే బాబారావు వీధి, కస్తూరిబాయిపేట ఆర్సీఎం చర్చిరోడ్డు, కాజా ముసలయ్య వీధి, చలమలవారి వీధి సీసీ, బీటీ రోడ్లుగా అభివృద్ధి చెందాయి. గిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి వీధి, బొబ్బూరి పురుషోత్తం వీధి, ఏశోబు వీధి, చిలకాప్రసాద్ వీధి, ఢిల్లీ కోటమ్మ వీధి, ఇందుపల్లి జయరాజు వీధిలో యూజీడీ పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసిన నిధులతో పాటు, నగర పాలక సంస్థ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. డివిజన్‌లో ఇప్పటి వరకూ రోడ్లు, సైడు డ్రెయిన్‌లు, యూజీడీకి సంబంధించి 50కి పైగా పనులు చేపట్టారు.

జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన చిత్రలేఖన పోటీల్లో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మలినేని సుమలత గురువారం వివరాలు తెలుపుతూ ఉగాది పండుగ సందర్భంగా నెల్లూరు అమీర్‌జాన్ అకాడమీ, విజయవాడ డీమ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ, ఏపీ కల్చరల్ కమిషన్ సంయుక్తంగా విజయవాడలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎ.మణికంఠ, జె.చరణ్‌కుమార్, పి.వరుణ్, కె.నాగమణి, వి.భార్గవి బంగారు పతకాలు, బి.సాత్విక్, ఎ.అఖిల, ఎస్.ఉమామహేశ్వరరావు వెండి పతకాలు సాధించారని తెలిపారు. పోరంకి పాఠశాలలో డ్రాయింగ్ మాస్టారు పోస్టు ఖాళీగా ఉన్నందున విశ్రాంత డ్రాయింగ్ మాస్టారు అరేపల్లి అప్పారావు విజయవాడ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై ఉచితంగా శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. అప్పారావుతో పాటు విద్యార్థులను అభినందించారు

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నందిగామ ఏసీపీ రవికిరణ్ సమీక్షించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై ఆలయ అధికారులు, గ్రామస్తులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో వారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా 23న స్వామి వారి కల్యాణోత్సవానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామస్తులు పార్టీ జెండాలు, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో భక్తులు ఆలయ అధికారులు చలువ పందిళ్లు, తాగునీరు, ఘాట్ చుట్టూ మ్యాట్‌లు, తదితర వసతులు కల్పించాలని సూచించారు.

అనంతరం కల్యాణ వేదిక ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈవో సాంబశివరావు, ఎస్ఐ సతీష్, గ్రామ పెద్దలు తాటి రామారావు, వసంతరావు, రాంబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఉంగుటూరు: ఉచిత పశు వైద్యశిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.వి.ఎస్ కిశోర్ తెలిపారు. పెద్ద అవుటపల్లిలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కిశోర్ అల్లాపురం సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 56 గేదెలకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు, 20 గేదెలకు సాధారణ వ్యాధులు, 35 గేదెలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు ఎస్.లక్ష్మీరాణి, డి.శ్రీనివాస్ కుమార్, ఎం.మల్లికార్జునరావు, ఐ.వసంత, కళాశాల బోధన సిబ్బంది, డాక్టర్లు ఎం.శ్రీనివాసరావు, రమేష్, వాణి, పశు వైద్యులు నాగార్జున, సుధీర్, కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.